మనం
కడప | అన్నమయ్య

## ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు : తహసీల్దార్



పెనగలూరు(ఆగస్టు 05),మనంన్యూస్:ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ ఏకే ప్రేమ్ కుమార్ తెలిపారు. బుధవారం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ పెనగలూరు మండలం దామనచర్ల రెవెన్యూ విలేజ్ లోని సర్వే నెంబర్ 1 లో ప్రభుత్వ భూమి ఆక్రమణపై చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. వెంటనే ప్రభుత్వ భూమి అని బోర్డు ఏర్పాటు చేసారు. మండల పరిధిలో ఎక్కడైనా ప్రభుత్వ భూములు ఆక్రమణ కు గురి అయితే కఠిన చర్యలు తప్పవని, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ భూమి ఆక్రమణ కు గురి అవుతుంటే గ్రామ సేవకులు ఉన్నతాధికారులు కు తక్షణమే సమాచారం అందించాలని లేని పక్షంలో వీఆర్ఏ లపై కఠిన చర్యలు తప్పవని పేర్కొన్నారు.






# ప్రతి ఇంటికి ప్రభుత్వ ఫలాలు

**తెదేపా నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు**

రాజంపేట ఆగస్టు 5(మనం న్యూస్) ప్రతి ఇంటికి ప్రభుత్వ ఫలాలు అందాలని,ప్రతి కార్యకర్త ప్రజలతో మమేకం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని నియోజకవర్గ ఇన్చార్జ్ శ్రీ చమర్తి జగన్ మోహన్ రాజు తెలియజేశారు.

బుధవారం రాజంపేట మండలం,తాళ్లపాక నందు పర్యటిస్తూ "రెండేళ్ల నమ్మకం – అభివృద్ధి సంక్షేమం" ఇంటింటికి తెలుగుదేశం ప్రచార కార్యక్రమాన్ని చమర్తి జగన్ మోహన్ రాజు గారు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి స్వయంగా వెళ్లి,సంక్షేమ ఫలాలు అందుతున్నాయా లేదా అని జగన్ మోహన్ రాజుగారు అడిగి తెలుసుకున్నారు అంతేకాకుండా ఆయన మాట్లాడుతూ గడిచిన రెండు సంవత్సరాల కాలంలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను కూడా ప్రజలకు జగన్ మోహన్ రాజు వివరించారు.

అదేవిధంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ప్రతి కుటుంబానికి సంక్షేమం,ప్రతి ప్రాంతంలో అభివృద్ధి అనే లక్ష్యంతో ముందుకు సాగుతుందన్నారు. ప్రజలకు ఏ కష్టం,నష్టం వచ్చిన వాటి పరిష్కారం కోసం ఎల్లవేలాల ప్రభుత్వం అందుబాటులో ఉంటుందన్నారు. తాళ్లపాక పార్టీ యూనిట్ స్థాయి సమావేశానికి హాజరైన నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు నేడు తాళ్లపాక నందు పర్యటిస్తూ ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా పార్టీ ఆదేశాల మేరకు ప్రతినెల మొదటి బుధవారం జరిగే యూనిట్ స్థాయి సమావేశానికి నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు గారు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనిట్ ఇన్చార్జెస్ మరియు బూత్ ఇన్చార్జెస్ తో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే పార్టీ ప్రధాన ధ్యేయమన్నారు. ప్రజా సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని నాయకులకు చమర్తి దిశా నిర్దేశం చేశారు.

ఈ కార్యక్రమంలో ఆయన వెంట క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ అద్దేపల్లి ప్రతాపరాజు, మండల అధ్యక్షులు రవికుమార్ నాయుడు,ఉద్దండం సుబ్రహ్మణ్యం,తాళ్లపాక గ్రామ అధ్యక్షులు లక్ష్మీనరసరాజు,యూనిట్ ఇంచార్జ్ జగదాభి రాజేంద్రప్రసాద్ రాజు, జనార్దన్ రాజు, జగదాభి పాండురాజు, వేమయ్య నాయుడు, వెంకట్ రాజు, హరి, రాజశేఖర్ రాజు,రమేష్ నాయుడు, హుస్సేన్, రోశయ్య రాజు తదితరులు పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి: కలెక్టర్




కడప, ఆగస్టు 5 (మనం న్యూస్) స్వాతంత్ర్య స్ఫూర్తి ఉట్టిపడేలా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను స్థానిక పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి, అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాల్లో జిల్లా కలెక్టర్ డా శ్రీధర్ చెరుకూరి, జిల్లా రెవెన్యూ అధికారి మల్లికార్జునుడుతో కలిసి అధికారులతో సమావేశమై 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఈ నెల 15 న స్థానిక పోలీసు పరేడ్ గ్రౌండ్ చేపట్టాల్సిన ఏర్పాట్లపై శాఖల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పరేడ్ నిర్వహణ, ముఖ్య అతిథుల రాకపోకలు, వేదిక ఏర్పాటు, విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్యం, వైద్య శిబిరం, అగ్నిమాపక, భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, సాంస్కృతిక కార్యక్రమాలు, విద్యార్థుల పాల్గొనడం, వివిధ శాఖల ప్రదర్శన స్టాళ్లు తదితర అంశాలపై ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమానికి విచ్చేసే విశిష్ట అతిథులకు తగిన గౌరవం కల్పించేలా ప్రత్యేక సీటింగ్ ఏర్పాట్లు చేయాలని, కార్యక్రమానికి హాజరయ్యే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతి శాఖకు అప్పగించిన బాధ్యతలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి, శాఖల మధ్య సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రజలను ఆకట్టుకునేలా ఆకర్షణీయమైన శకటాలను, ప్రభుత్వ ప్రగతిని స్పష్టంగా చాటి చెప్పేలా వివిధ స్టాళ్లను, దేశభక్తి ఉట్టిపడేలా సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. వివిధ శాఖల్లో ఉత్తమ సేవలందించిన అధికారులు, సిబ్బందిని గుర్తించి ప్రశంసా పత్రాలు అందచేయాలని సూచించారు.

ఈ సమావేశంలో ఆర్డీఓ మురళి, మున్సిపల్ కమిషనర్ శ్రీ భవానీ ప్రసాద్, సిపిఓ శ్రీ హాజరత్తయ్య, పిడి డిఆర్డిఏ డా రాజ్యలక్ష్మి, డ్వామా పిడి శ్రీ ఆదిశేషా రెడ్డి, వ్యవసాయ శాఖ జేడి సుబ్రహ్మణ్యేశ్వర రావు, ఉద్యాన శాఖ అధికారి హరి ప్రసాద్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు






## స్వర్గీయ ఇడిమడకల హైమావతికి నివాళులర్పించిన పార్టీ ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి, చమర్తి జగన్ మోహన్ రాజు

రాజంపేట ఆగస్టు 5 (మనం న్యూస్) : రాజంపేట పట్టణం మన్నూరు గ్రామం నందు పర్యటిస్తూ బుధవారం తెలుగుదేశం పార్టీ మాజీ రాష్ట్ర కార్యదర్శి ఇడిమడకల కుమార్ అమ్మగారైన స్వర్గీయ ఇడిమడకల హైమావతి ఇటీవల మృతి చెందగా నేడు వారి స్వగృహం నందు పార్టీ ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి గారితో కలిసి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన రాజంపేట నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు ఈ కార్యక్రమంలో ఆయన వెంట పలువురు పార్టీ ముఖ్య నాయకులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# డబ్బా పాలు వద్దు తల్లిపాలే ముద్దు

**తల్లిపాల వారోత్సవాల కార్యక్రమానికి హాజరైన నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు**







రాజంపేట మనం న్యూస్ ఆగస్టు 5

డబ్బా పాలు వద్దు – తల్లిపాలే ముద్దు అనే నినాదంతో ప్రతి తల్లి ముందుకు సాగాలని నియోజకవర్గ ఇన్చార్జ్ శ్రీ చమర్తి జగన్ మోహన్ రాజు గారి పేర్కొన్నారు.బుధవారం నాడు రాజంపేట మండలం,తాళ్లపాక గ్రామం నందు పర్యటిస్తూ తల్లిపాల వారోత్సవాల కార్యక్రమానికి చమర్తి జగన్ మోహన్ రాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చమర్తి మాట్లాడుతూ బిడ్డ పుట్టిన గంటలోపు తల్లి ముర్రుపాలను తాగించాలని తెలిపారు. ముర్రు పాలు తాగించడం వల్ల పిల్లలలో వ్యాధి నిరోధక శక్తి పెరిగి జీవితంలో వారికి అంటూ వ్యాధులు ప్రబలకుండా ఉంటాయని చమర్తి జగన్ మోహన్ రాజు తెలియజేశారు. ఈ సందర్భంగా చమర్తి దృష్టికి అంగన్వాడీ సమస్యలు తీసుకురాగా పిచ్చి చెట్లు,విషపురుగులు సంచరిస్తున్నాయని తెలపగా తక్షణమే వాటిని తొలగించాలని సంబంధిత అధికారులకు పలు ఆదేశాలను జగన్ మోహన్ రాజు జారీ చేశారు. అంతేకాకుండా అంగన్వాడి పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టి, పరిశుభ్రంగా ఉంచాలని పంచాయతీ కార్యదర్శులు ఆదేశించారు.అంతకుముందు పిల్లలతో సరదాగా కాసేపు చమర్తి ముచ్చటించారు. అంగన్వాడీలో వసతులపై పిల్లల తల్లిదండ్రులతో ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఐసిడిఎస్ అధికారులు / స్థానిక పార్టీ ముఖ్య నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## 45 రోజుల యాక్షన్ ప్లాన్‌ను సమర్థవంతంగా అమలు చేయాలి

### పంచాయతీ కార్యదర్శులకు డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసులు దిశానిర్దేశం

పుల్లంపేట ఆగస్టు5 (మనంన్యూస్:) తిరుపతి జిల్లా పుల్లంపేట మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులతో డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసులు సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 45 రోజుల యాక్షన్ ప్లాన్ లక్ష్యాలను ప్రతి గ్రామంలో సమర్థవంతంగా అమలు చేసి ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనాలు చేకూరేలా పనిచేయాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో పారిశుద్ధ్యం, తడి చెత్త--పొడి చెత్త వేరు చేసే విధానం, ఇంటింటా చెత్త సేకరణ, వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణ, కంపోస్టు తయారీ, ప్లాస్టిక్ వ్యర్థాల నియంత్రణ, మొక్కల సంరక్షణ, పరిశుభ్రమైన గ్రామాల నిర్మాణం వంటి అంశాల అమలు తీరుపై కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. ప్రజల్లో అవగాహన పెంచేందుకు విస్తృత ప్రచారం నిర్వహించాలని, తడి చెత్తతో సేంద్రియ ఎరువును తయారు చేసి రైతులు, ప్రజలు వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు.ప్రభుత్వం నిర్దేశించిన కార్యాచరణ ప్రణాళికను ఎలాంటి అలసత్వానికి తావులేకుండా అమలు చేయాలని, గ్రామాల్లో ప్రజల అవసరాలను గుర్తించి సమస్యలకు సత్వర పరిష్కారం చూపే విధంగా పనిచేయాలని అన్నారు. ప్రతి గ్రామంలో పరిశుభ్రత, తాగునీటి నిర్వహణ, మొక్కల సంరక్షణ, పారిశుద్ధ్య నిర్వహణ, ప్రభుత్వ పథకాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.అధికారులు గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా కృషి చేయాలని సూచించారు. అలాగే 45 రోజుల యాక్షన్ ప్లాన్‌లో నిర్దేశించిన లక్ష్యాలను రోజువారీగా సమీక్షించి, పురోగతిని నమోదు చేయాలని కార్యదర్శులకు దిశానిర్దేశం చేశారు.


## ఉపాధ్యాయ,ఉద్యోగులకు డిఏలు అందని ద్రాక్షేనా



పెనగలూరు(ఆగస్టు 5),మనంన్యూస్:రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల కు 5 డిఏ లు పెండింగ్ పెట్టి అందని ద్రాక్ష లాగా ప్రభుత్వము వ్యవహరిస్తున్న తీరు పట్ల యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి. హరి. ప్రసాద్, పెనగలూరు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి. శ్రీనివాస కుమార్, యం. నరసింహారావు అసంతృప్తి వ్యక్తం చేశారు. బుధవారం వారు పాత్రికేయులతో మాట్లాడుతూ జూలై- 2024 నుండి ఐదు విడతలు డిఏలు విడుదల చేయకపోవడం, పిఆర్సీ, ఐఆర్ ఊసులేకపోవడం, సరెండర్ లీవ్ బకాయిలు నాలుగు ఏళ్ళు గా చెల్లింపు లేకపోవడం వల్ల ప్రభుత్వం పై ఉద్యోగుల స్వరం మారుతోందని అన్నారు. ఉద్యోగుల ఆరోగ్య సంరక్షణ ఇన్సూరెన్స్ విధానం అమలుచేస్తామని ఏడాదిన్నర క్రితం చెప్పినా కనీసం ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదన్నారు. ఉద్యోగులకు జరిగిన నష్టాన్ని నివారించి, వారి స్వరం పెంచకముందే వెంటనే స్పందించాలని సమస్యలు పరిష్కారం చేయాలని ముఖ్యమంత్రిని ఈ సందర్భంగా కోరారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విడుదల చేసిన ఒక్క డిఏకి సంబందించి ఈ నెలలో చెల్లించాల్సిన మొదటి విడత బకాయిలు చెల్లింపుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. నిలిచిపోయిన బకాయిల చెల్లింపుకు తెలంగాణ రాష్ట్రంలో వలె ప్రతి నెలా విడతల వారీగా విడుదల చేస్తే ప్రభుత్వం మీద భారం కొద్ది కొద్దిగా తగ్గుతుందని పేర్కొన్నారు. కావున ఆ దిశగ రూట్ మ్యాప్ ప్రకటించాలని కోరారు. కాంట్రిబ్యూటరి పెన్షన్ విధానం రద్దు చేసే దిశగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు..

## పలు దశదిన కర్మల్లో పాల్గొని శ్రద్ధాంజలి ఘటించిన మాజీ ఎమ్మెల్సీ బత్యాల

చిట్వేలీ ఆగస్టు 5 మనం న్యూస్ ప్రతినిధి: మండల పరిధిలోని బాకరాపురం కొత్తపల్లి గ్రామానికి చెందిన మాజీ ఉప ఎంపీపీ నాశింశెట్టి పాపయ్య, మరియు చిట్వేలీ మండలం పోలోపల్లి గ్రామానికి చెందిన బత్తిన వెంకటసుబ్బారెడ్డి దశదిన కర్మలలో పాల్గొని వారి చిత్రపటానికి పూలు సమర్పించి శ్రద్ధాంజలి ఘటించిన మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్ రాయుడు. అనంతరం వారి కుటుంబసభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతినీ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, తదితరులు పెద్దఎత్తున పాల్గొన్నారు.



# ప్రమాదాల ముంగిట 'రైల్వే కోడూరు ప్రధాన రహదారి

### అయ్యప్ప స్వామి ఆలయ మలుపు వద్ద నిలిపివేస్తున్న లారీలు
### గంటల తరబడి రాకపోకలకు అంతరాయం- భయాందోళనలో వాహనదారులు

తిరుపతి జిల్లా రైల్వే కోడూరు పట్టణంలోని కడప-తిరుపతి ప్రధాన రహదారిపై నిత్యం ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. ముఖ్యంగా స్థానిక శ్రీ అయ్యప్ప స్వామి ఆలయం వద్ద ఉన్న ప్రమాదకరమైన మలుపు వద్ద బొప్పాయి, ముగ్గురాయి లోడుతో ఉన్న లారీలను గంటల తరబడి నిలిపివేయడం స్థానికులను, వాహనదారులను తీవ్ర భయాందోళనలకు గురిచేస్తోంది.

?ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ ఎక్కువగా ఉండే సమయాల్లోనే లారీ యజమానులు, డ్రైవర్లు వాహనాలను నేరుగా ఈ మలుపు వద్దే రోడ్డుపై ఆపేస్తున్నారు. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ ప్రధాన రహదారిపై, అదీ కూడా మలుపు వద్ద భారీ వాహనాలు నిలపడం వల్ల ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది.

?ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయం.

?రోడ్డు మలుపు వద్ద ఆపి ఉంచుతున్న లారీల వల్ల వెనుక నుంచి లేదా ఎదురుగా వేగంగా వచ్చే వాహనదారులు అదుపుతప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు.ఈ రహదారిపై నిత్యం ప్రయాణించడమంటే ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వెళ్లడమే. మలుపు వద్ద లారీల పరిస్థితి ప్రతిరోజూ ఇంతే ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఎప్పుడు ఏ ఘోర ప్రమాదం జరుగుతుందో అని భయమేస్తోంది అని స్థానిక వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.?ప్రధాన రహదారిపై, ముఖ్యంగా అయ్యప్ప స్వామి ఆలయ మలుపు వద్ద లారీల అక్రమ పార్కింగ్‌పై ట్రాఫిక్ మరియు పోలీస్ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ప్రమాదాలు జరిగి ప్రాణనష్టం జరగకముందే అధికారులు స్పందించి, మలుపు వద్ద వాహనాలు నిలపకుండా తగిన చర్యలు చేపట్టాలని రైల్వే కోడూరు ప్రజలు కోరుకుంటున్నారు.





# ఏపీఎండీసీలో కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

## ఏపీఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్

ఓబులవారిపల్లి ,ఆగస్టు 05 , మనం న్యూస్ : ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థ లో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కార్మిక సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏపీఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ మేనేజ్‌మెంట్‌ను డిమాండ్ చేసింది. యూనియన్ ప్రధాన కార్యదర్శి పోకూరు మురళి అధ్యక్షతన ప్రతినిధి బృందం చీఫ్ ప్రాజెక్ట్ ఆఫీసర్ గోపినాథ్ ద్వారా మేనేజింగ్ డైరెక్టర్ కి తమ న్యాయమైన వినతులను సమర్పించింది. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ, సంస్థ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న కార్మికుల సంక్షేమాన్ని యాజమాన్యం విస్మరించకూడదని పేర్కొన్నారు. ప్రధానంగా క్రింది డిమాండ్లను మేనేజ్‌మెంట్ దృష్టికి తీసుకెళ్లారు. రిటైర్డ్ ఔట్‌సోర్సింగ్ కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలి: సంస్థలో గత 18 ఏళ్లుగా సేవలందించి, 60 ఏళ్లు నిండాయనే నెపంతో తొలగించిన ఔట్‌సోర్సింగ్ కార్మికులను వెంటనే విధుల్లోకి పునరుద్ధరించాలి. ప్రభుత్వం ఏపీఎండిసిలో రిటైర్మెంట్ వయోపరిమితిని 60 నుండి 62 సంవత్సరాలకు పెంచినందున, వీరిని కూడా తిరిగి విధుల్లో చేర్చుకోవాలని కోరారు.


నేరుగా వేతనాల చెల్లింపు: ఏపీఎండిసి ప్రాజెక్టుల కోసం తమ ఇళ్లు, భూములు ఇచ్చి పునరావాస పథకం కింద ఔట్‌సోర్సింగ్ కార్మికులుగా చేరిన వారందరికీ మధ్యవర్తులు లేకుండా నేరుగా ఏపీఎండిసి యాజమాన్యమే వేతనాలు చెల్లించాలి. మరణించిన కార్మికుల కుటుంబాలకు న్యాయం: విధి నిర్వహణలో లేదా సేవా కాలంలో మరణించిన కార్మికుల కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాయని, ఆ కుటుంబాలకు తక్షణమే పరిపరిహారం మరియు కారుణ్య ప్రాతిపదికన న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. కమిటీ నివేదిక వేగవంతం: కార్మిక సమస్యల అధ్యయనం మరియు పరిష్కారం కోసం మేనేజ్‌మెంట్ ఏర్పాటు చేసిన కమిటీ త్వరితగతిన తన చర్యలను పూర్తి చేసి సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు గురసాల దినేష్, బత్తల హరి, మునిశేఖర్, రామచంద్రయ్య, వాసు, విజయ్ కృష్ణ, బాలు, భాను ప్రకాష్, నాగవరం సాయి, మణికంత, నరసింహులు, భవదీష్, విజయ్, రసూల్ తదితరులు పాల్గొన్నారు.



# పేదల అభ్యున్నతే కూటమి ప్రభుత్వ ధ్యేయం

### టీడీపీ మండల అధ్యక్షుడు ఎంజర్ల నారాయణ రెడ్డి

పెనగలూరు(ఆగస్టు 5),మనంన్యూస్: పేదల అభ్యున్నతే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పెనగలూరు మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఎంజర్ల నారాయణ రెడ్డి తెలిపారు. బుధవారం పెనగలూరు మండలం కాకర్ల వారిపల్లి గ్రామంలో "రెండేళ్ల అభివృద్ధి - నమ్మకం - సంక్షేమం" కార్యక్రమం టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు ఎంజర్ల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం దశల వారీగా అమలు చేస్తోందని తెలిపారు. 'సూపర్ సిక్స్' హామీల అమలుతో రాష్ట్ర ప్రజల్లో ప్రభుత్వంపై విశ్వాసం మరింత పెరిగిందన్నారు. 'తల్లికి వందనం' పథకం ద్వారా ఇంట్లో చదువుతున్న ప్రతి విద్యార్థి కోసం తల్లికి ఆర్థిక సహాయం అందించడం సంతోషకరమని పేర్కొన్నారు. 'దీపం-2' పథకం కింద ప్రతి కుటుంబానికి ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే 'స్త్రీ శక్తి' పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 'అన్నదాత సుఖీభవ' కింద రైతులకు రూ.20 వేల వరకు పెట్టుబడి సాయం అందిస్తున్నట్లు చెప్పారు. పేదల ఆకలి తీర్చేందుకు రాష్ట్రవ్యాప్తంగా అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. రైతుల హక్కుల పరిరక్షణ కోసం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేసి, రాజముద్రతో కూడిన కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలను అందజేయడం రైతులకు వరం లాంటిదని వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు ప్రసన్న, మాజీ మండల అధ్యక్షుడు జయరామయ్య నాయుడు, మాజీ సర్పంచ్ పెరుగు చంద్రమౌళి, రైతు సంఘం అధ్యక్షుడు పెరుగు కిష్టయ్య నాయుడు, మరియు పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

సిద్ధవటం, ఆగస్టు 5 మనం న్యూస్ : సిద్ధవటం పెన్నా నది సమీపాన బుధవారం అక్రమ ఇసుక రవాణా చేస్తున్న 2 ఇసుక ట్రాక్టర్లను కడప మైన్స్ అండ్ జియాలజి విజిలెన్స్ స్క్వాడ్ ఇసుక ట్రాక్టర్లను అదుపులోకి తీసుకొని స్థానిక పోలీస్ పోలీస్ స్టేషన్ కు అప్పగించారు ఈ సందర్భంగా విజిలెన్స్ అధికారులు మాట్లాడుతూ కడప జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ ఆదేశాల ప్రకారం పెన్నా నది ప్రాంతాలలో ఆగస్టు నెల వరకు ఎటువంటి తవ్వకాలు జరుపకూడదని ఆదేశాలు ఇచ్చారని అక్రమ ఇసుక రవాణా జరుగుతున్నట్లు సమాచారం రావడంతో సమీప పెన్నా నది వద్ద ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్ తరలించామని ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమ ఇసుక రవాణా జరపకూడదని పేర్కొన్నారు

